ప్రయాణం.. నరకప్రాయం





- కుషాయిగూడ డీమార్ట్ వద్ద రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- ఒకవైపు గుంతలు.. మరోవైపు ఇరుకు రోడ్డు
- చిన్న వర్షానికే కాలువను తలపించేలా రోడ్డు
- మరమ్మతుల్లో అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- సమస్యను పట్టించుకోని అధికారులు



వర్షం కారణంగా కుషాయిగూడ డీ మార్ట్ వద్ద దారుణమైన పరిస్థితి

కాప్రా: చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ డీమార్ట్ వద్ద వాహనదారులు నిత్య నరకం చవిచూస్తున్నారు. డీమార్ట్‌కు నిత్యం వేలాదిమంది వినియోగదారులు వస్తుంటారు. ఈ వినియోగదారులకు సరిపడా పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో డీమార్ట్ సిబ్బంది వినియోగదారుల వాహనాలను లోనికి అనుమతికుండా గేట్లు మూసివేస్తున్నారు. దీంతో రోడ్లపైనే వాహనాలు వదిలి లోనికి రావాలని చెబుతుండటంతో గత్యంతరం లేక వినియోగదారులు రోడ్డు పక్కనే వాహనాలను పార్కు చేస్తున్నారు. ఈ కారణంగా రాకపోకలకు తీవ్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ఈ రోడ్డులో పెద్దపెద్ద గుంతలు, ఆపైగా డీమార్ట్ ఎదురుగానే మలుపు ఉండటం, అక్కడ రోడ్డు అంతా గుంతలమయంగా మారడంతో సమస్య మరింత జటిలమవుతుంది.

రోడ్డు మధ్యలో గుంత...

ఈ ప్రాంతంలో రోడ్డు కిందుగా డ్రైనేజీ పైప్‌లైన్ వెళుతోంది. దీంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో అదే ప్రాంతంలో రోడ్డు మధ్యలో తరచూ గుంతలు ఏర్పడుతున్నాయి. దీన్ని అధికారులు కూడా తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటుండంతో తిరిగి సమస్య పునరావృతం అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా మరమ్మతు పనులు చేస్తారో లేదో అలా మాయమైపోతాయనే విధంగా పరిస్థితి తయారవుతుంది. సమస్యను పరిష్కరించడంలో, మరమ్మతులు చేయించడంలో అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపట్టేలా ఉందని స్థానికులు వాపోతున్నారు.

చినుకు పడితే కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్...

ఇక చిన్న వర్షం పడితే చాలు ఈ ప్రాంతమంతా ఓ చెరువును తలపిస్తోంది. వరద నీటిలో ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు ప్రయాణం సాగిస్తూ పలుమార్లు ప్రమాదాల బారినపడి సంఘటలు కూడా అనేకం ఉన్నాయి. వర్షం వచ్చిందంటే చాలు డీమార్ట్ మూలంగా ఆ మాల్‌కు వచ్చే వాహనాలతో రోడ్డు మొత్తం జామ్ అవుతుంది. రోడ్డు చిన్నదిగా ఉండటం.. అందులో డీ మార్ట్‌కు వచ్చే వాహనాలు రోడ్డుపై నిలపడం, దీనికితోడు డీమార్ట్ ముందే అనధికార ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకోవడంతో భారీ ట్రాఫిక్ జామ్ అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఉదయం సాయంత్రం వేళల్లో కనీసం 100 మీటర్ల ప్రయాణానికి దాదాపు 30 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పార్కింగ్ సమస్యతో ట్రాఫిక్ జామ్...

డీ మార్ట్‌కు వచ్చే వాహనాలకు పూర్తిస్థాయిలో పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిపి సరుకుల కొనుగోలుకు వెళ్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం డీ మార్ట్ నిర్వాహకులు పార్కింగ్ లేదని లోనికి అనుమతించకపోవడమే. పార్కింగ్ స్థలం లేకపోవటంతో రోడ్డుపై పార్క్ చేసి లోనికి రావాలని చెబుతుండటంతో వినియోగదారులు చేసేదేమీ లేక వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



బాలికల పాఠశాలలో సమావేశం

మల్కాజిగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతుల గురించి హెచ్ఎం సరస్వతీని అడిగి తెలుసుకున్నారు. స్కూళ్లలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు సహకరించాలని ఆమె కార్పొరేటర్‌ను కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

ఘట్‌కేసర్: బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అవుషాపూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మశ్చేందర్‌రెడ్డి, మల్లేశ్, వెంకటేశ్‌గౌడ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి



మల్లాపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మొసలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, కష్టపడేవారికి పార్టీతో సముచిత స్థానం ఉంటుందని రేవంత్‌రెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు. సీఎంను కలిసిన వారిలో శేఖర్ తదితరులు ఉన్నారు.

అత్యాధునిక కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: స్విట్జర్లాండ్‌కు చెందిన వాచీల తయారీ బ్రాండ్ ఓమెగా వైవిధ్య భరితమైన కలెక్షన్స్ విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని జూబ్లీహిల్స్‌లో తమ తొలి ఒమెగా బొటిక్‌ను ఏర్పాటు చేశామని, అలాగే తమ ఒమెగా కాన్‌స్టేషన్ కలెక్షన్ పేరిట ఈ కలెక్షన్‌తో పాటు 20 వినూత్నమైన అత్యాధునిక మోడల్స్‌ను నగరవాసులకు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలి



నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేస్తున్న జాగృతి మహిళా మండలి సభ్యులు

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని జాగృతి మహిళా మండలి అధ్యక్షురాలు లక్ష్మీ కుట్టి అన్నారు. జాగృతి మహిళా మండలి ఆధ్వర్యంలో దయానంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జ్యోతి స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. డాక్టర్ హారతి, మహిళా మండలి సెక్రటరీ శాంత, పవనకుమారి, హేమమాలిని, దీప తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని న్యూమిర్జాలగూడలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరై పూజలు చేశారు.

వాసవి ఎన్‌క్లేవ్‌లో న్యూట్రిషన్, కగ్నేటివ్ సర్వే



అల్వాల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్- జాతీయ పోషకాహార సంఘం ఉద్యోగులు మంగళవారం అల్వాల్ వాసవి ఎన్‌క్లేవ్‌లో న్యూట్రిషన్, కగ్నేటివ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి ఎన్‌క్లేవ్ గౌరవ అధ్యక్షుడు పెద్ది రమేష్ మాట్లాడుతూ.. ఈ సర్వేలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధుల ఆహార, కగ్నేటివ్ సర్వే స్టేటస్ తెలుసుకున్నారని, ప్రతిరోజూ 8 మంది వృద్ధులకు మాత్రమే పరీక్ష చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానికవాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



నగదు పురస్కారం అందజేస్తున్న సురేష్ చౌహాన్

బోడుప్పల్: ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ సికింద్రాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ చౌహాన్ అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో సోమవారం అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన ఆదర్శ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఆదాయం తగ్గిందని, ఆదాయం పెంచుకునేందుకు మార్గాలను అన్వేషించి ఆదాయాన్ని సమకూర్చుకున్నట్లు వెల్లడించారు. ఇందనాన్ని పొదుపు చేసిన డ్రైవర్లు, మెకానిక్‌లతో పాటు ఎక్కువ ఆదాయాన్ని తీసుకొచ్చిన కండక్టర్లకు నగదు పురస్కారంతో పాటు ప్రగతి చక్ర అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ పీకే సత్యన్, కుబేరుడు, డిపో సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటక స్టడీ టూర్‌కు తెలంగాణ కురుమ జేఏసీ నేతలు



కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో తెలంగాణ కురుమ జేఏసీ నేతలు

మల్లాపూర్: తెలంగాణ కురుమ జేఏసీ నేతలు బెంగళూర్, కర్ణాటక స్టడీ టూర్ వెళ్లారు. అక్కడ ఉన్న కురుమ పుస్తక ముద్రాలయం, గంథ్రాలయం, విద్యా సంస్థలు, మఠాలు, కనక పీఠాలను సందర్శించారు. అక్కడ ఉన్న సాహిత్య, ఇతిహాసాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్, ఐదు గ్యారంటీల ఇన్‌చార్జి రువన, కనకురుబ, పీఠాధిపతుల నిరంజనానందపూరి స్వామిజీలను కలిశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాములు కురుమ, హైకోర్టు అడ్వకేట్ గొరిగే మల్లేష్ కురుమ, జేపీ చౌదరిపల్లి పర్వతాలు కురుమ, జేఏసీ నాయకులు ఎస్ఆర్ఐ సుభాష్, సైంటిస్ట్ లక్ష్మయ్య, రావుల కృష్ణయ్య, జక్కుల వంశీకృష్ణ, గురునాథ్, బీర్ల శ్రీనివాస్, పీజీ కాలేజీ ప్రిన్సిపల్ చంద్రయ్య కురుమ తదితరులు ఉన్నారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



సమావేశంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తదితరులు

మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ 5స్టార్ గ్రేడ్ సెట్టింగ్ సిమెంట్‌ను విడుదల చేసింది. మేడిపల్లిలోని సవేరా ఏజెన్సీస్ ఆధ్వర్యంలో 120 మందికి పైగా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పనులు పూర్తవడమే కాకుండా నిర్మాణాలు ధృడంగా ఉంటాయని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతీ సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, సవేరా ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, భారతీ సిమెంట్ చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్ కుమార్, సునీల్ కొట్ట, సాత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నర్సుల నిరసన



ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిరసనకు దిగిన నర్సులు

ఘట్‌కేసర్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్, డీహెచ్, డీఎంఈ పరిధిలో నర్సింగ్ ఆఫీసర్స్ ప్రమోషన్స్, సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట తెలంగాణ ఆల్ నర్సింగ్ ఫెడరేషన్(టీఏఎన్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ కేడర్ కోసం ప్రత్యేకంగా జేడీ, వీడీ పోస్టు సృష్టించి నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వు 317 ద్వారా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ అటానమస్‌ను రద్దు చేసి వైద్యారోగ్య శాఖలో విలీనం చేయాలని, కొత్తగా రిక్రూట్ అయిన నర్సింగ్ ఆఫీసర్స్ బకాయిల వేతనాలు తక్షణమే చెల్లించాలని, అలాగే తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లో 1999 బ్యాచ్ వారందరికీ వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాలునాయక్, వసంత, సుహాసిని, లక్ష్మీకుమారి, దేవమణి, జానకి, శారద పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఓ ప్రైవేటు పాఠశాల సీజ్

ఉప్పల్: ఉప్పల్‌లో అనుమతి లేని ఓ పాఠశాలను సీజ్ చేయాలంటూ ఏఐవైఎఫ్ నాయకులు మంగళవారం స్కూల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దీంతో స్పందించిన విద్యాశాఖ అధికారులు, సీఆర్పీ సుగుణ ఆధ్వర్యంలో ఆ ప్రైవేటు స్కూల్‌కు సిబ్బందిని పంపించి సీజ్ చేయించారు. దీంతో ఏఐవైఎఫ్ నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు శ్రీకాంత్, జిల్లా సభ్యులు శేఖర్, కిరణ్, కళ్యాణ్, మాజీద్, మహేష్, అజీమ్‌పాషా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం

శామీర్‌పేట్: శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డుపై మంగళవారం కారు దగ్ధమైంది. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి డిచ్‌పల్లికి వెళ్తున్న కారు శామీర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు రాగానే పొగలు వచ్చాయి. గమనించిన అందులోని వారు వెంటనే కారు దిగారు. తర్వాత ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

శామీర్‌పేట్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని శామీర్‌పేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో బొమ్మరాశిపేట ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో రెవెన్యూ శాఖ, పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 19 క్వింటాళ్ల లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైసెన్స్‌డ్ కంపెనీల విత్తనాలనే విక్రయించాలి



విత్తన కంపెనీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శామీర్‌పేట్: లైసెన్స్‌డ్ కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని మేడ్చల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం అధికారి ఏడీఏ వెంకట్రామ్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట మండలంలో గల విత్తన తయారీ కంపెనీలు, డీలర్ల షాపులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, పంటలు పూర్తయ్యేవరకు బిల్లులు, విత్తనాల సంచులను అన్నదాతలు భద్రపర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జానయ్య, మండల వ్యవసాయాధికారి రమేశ్, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లీకేజీలను అరికట్టండి



కాలనీవాసులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డ్రైనేజీ లీకేజీలను అరికట్టాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. విష్ణుపురికాలనీలో మురుగు లీకేజీలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని చోట్ల లీకేజీలతో బోరు, తాగునీరు కలుషితం అవుతోందని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలి

ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీతో కార్పొరేటర్ ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఖర్చు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్లు లేవని, టాయిలెట్స్‌కు తలుపులు సరిగ్గా లేవని మెడికల్ అధికారి సౌందర్య లత కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బోగ ప్రకాశ్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలమయమైన రోడ్లు



సత్యదేవుని ఆలయం వద్ద..

రామంతాపూర్: భారీ వర్షానికి రామంతాపూర్‌లోని పలు బస్తీలు, కాలనీలు జలమయమయ్యాయి. వరద నీరు రోడ్లపై ఎక్కడికక్కడే నిలిచిపోవడం వల్ల పాదచారులు, వాహనదారులు మంగళవారం రాత్రి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇందిరానగర్‌లోని సత్యదేవుని ఆలయం వద్ద రెండు రోజులుగా భారీగా పొంగుతున్న మురుగుతో ఆ ప్రాంతం చిన్నపాటి చెరువును తలపిస్తోంది.

పత్తాలేని మాన్‌సూన్ సిబ్బంది

రోడ్లన్నీ వరద నీటితో నిండిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీటి ప్రవాహాన్ని దారి మళ్లించడానికి ఉప్పల్ సర్కిల్ మాన్‌సూన్ సిబ్బంది పత్తా లేకుండా పోవడంతో వరద నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



శిక్షణ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు చేయడమే కాకుండా జాబ్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఐఐసీ ఢిల్లీ బృందం సభ్యులు అభినవ్, మహేందర్ అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన శిక్షకులు స్టార్టప్ విజయ గాథలు, ఎలా ఎదగాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐసీ ఢిల్లీ సభ్యులు అభినవ్, మహేందర్, సుమంత్, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, కన్వీనర్ ప్రేమలత, అబ్దుల్ సుభాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై సమగ్ర సర్వే

కీసర: మండలవ్యాప్తంగా మిషన్‌భగీరథ పథకంపై సమగ్ర సర్వే చేపడుతున్నామని ఎంపీడీవో గ్యామ అన్నారు. మండలకేంద్రంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ నల్ల కనెక్షన్ల వివరాలు, తాగు నీటి సరఫరా ఎలా ఉందన్న విషయాలను యాప్‌లో నమోదు చేస్తుండగా మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటికే సర్వే ఎలా చేపట్టాలి, సర్వే అంశాలను యాప్‌లో ఎలా నమోదు చేయాలనే అంశాలపై గ్రామ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు తదితర సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సురేశ్, గ్రామకార్యదర్శి గంగన్న పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: ఇబ్రహీంపట్నంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చరిత్ర, రాజనీతి శాస్త్రం, భూగోళ శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి గల అతిథి మహిళా అధ్యాపకులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఈ నెల 18న ఉదయం 10 గంటల్లోపు కళాశాలలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. డెమో ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, ఆయా సబ్జెక్టులో ఎంఏ పూర్తి చేసి ఉండాలని, ఎస్‌సీ, ఎస్‌టీ, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) ఏర్పాటు చేయాలని తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి మంగళవారం కమిషనర్ వెంకటగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని కూడళ్ల వద్ద స్ట్రీట్ లైట్స్ లేక ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళీగౌడ్, మోహన్‌రెడ్డి, కార్యదర్శి మురళీగౌడ్, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో సమావేశమైన కమిషనర్

శామీర్‌పేట్: వర్షాకాల విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో వర్షాకాలం, తుఫాను ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేశామని వారు 24 గంటలు పాటు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.